## ఎమ్మెల్యే దగ్గుపాటికి రాఖీ కట్టిన ఎమ్మెల్సీ రమాదేవి, తెలుగు మహిళలు

అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో రాఖీ పౌర్ణమి సందడి కనిపించింది. ఎమ్మెల్యే దగ్గుపాటికి పెద్ద ఎత్తున మహిళలు రాఖీలు కట్టి ఆయనపై ఉన్న సోదర భావాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, తెలుగుమహిళలు, బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక అని అన్నారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మగౌరవం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ





అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా విద్య, యువత, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న మంత్రి శ్రీ నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో మహిళలు, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా, భద్రతతో జీవించేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల ఆశీస్సులు, అభిమానాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తూ, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని మహిళల సంక్షేమం, భద్రత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. రక్షాబంధన్ పర్వదిన సందర్భంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని మహిళలందరికీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీసుల ఆరోగ్యంపై జిల్లా ఎస్పీ శ్రద్ధ

- ఏఆర్ సిబ్బందికి యోగా సాధన
- విధి నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించి, శారీరక ధారుడ్యాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా యోగా నిర్వహణ
- పర్యవేక్షించిన ఏఆర్ అదనపు ఎస్పీ





అనంతపురం క్రైం ప్రతినిధి, ఆగస్టు 28 అనంత సూర్య : జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించి, శారీరక ధారుడ్యాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.?ఈ సందర్భంగా యోగా మాస్టర్ హెడ్ కానిస్టేబుల్ చలపతి సిబ్బంది చేత పలు రకాల యోగాసనాలు, ప్రాణాయామం చేయించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ ఐ లు పవన్ కుమార్, మధు, ఆర్ ఎస్ ఐ లు జాఫర్, బాబ్జాన్ లతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ దలవాయి రమాదేవికి సన్మానం

అనంతపురం క్రైం ప్రతినిధి, ఆగస్టు 28 అనంత సూర్య : ఎమ్మెల్సీ శాసన మండలి సభ్యురాలు దలవాయి రమాదేవికి బిజెపి జిల్లా పార్టీ ఆఫీసులో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ.. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని పార్టీలో కష్టించే వారికి గుర్తించి ఉన్నతమైన పదవులు ఇస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్, జనసేన అధ్యక్షులు పవన్



కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో కష్టించి పనిచేసే వారికి పార్టీలో గౌరవప్రదమైన పదవులు దక్కుతున్నాయని, అందులో భాగంగానే అనంతపురం అర్బన్ క్లస్టర్ ఇంచార్జిగా పనిచేస్తున్న దలవాయి రమాదేవికి కూటమి ప్రభుత్వం గుర్తించి శాసనమండలి సభ్యురాలుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిందని ఆయన అన్నారు. కష్టించి పనిచేసే వారికి పదవులు ఇవ్వడంలో బిజెపి పార్టీ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పాంశెట్టి నాగరాజు కోశాధికారి అయ్యన్న ద్వారకా నగర్ మండల అధ్యక్షులు సంఘాల ఆనంద్, ఈటి నాగరాజు, శ్రీనివాసులు, అయ్యప్ప నాగరాజు, రవి, రాజేంద్ర, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు,

## రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయం

### వాహనాల డ్రైవర్లకు 'ఫేస్ వాష్ అండ్ గో'



అనంతపురం క్రైం ప్రతినిధి, ఆగస్టు 28 అనంత సూర్య : జిల్లాలోని టోల్ ప్లాజాల వద్ద ఫేస్ వాస్ అండ్ గో కార్యక్రమం నిర్వహణ,రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని చేపడతున్నారు. అర్ధరాత్రి నుండీ ఉదయం వరకు జిల్లా పరిధిలోని మరూరు, కాశేపల్లి, జల్లిపల్లి, జోడి ధర్మాపురంటోల్ ప్లాజాల వద్ద ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.?రాత్రిపూట, తెల్లవారుజామున ప్రయాణించే లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్ల డ్రైవర్లను నిలిపి, వారిని వాహనాల నుంచి కిందకు దించారు. నిద్రవంత్తు వదిలించుకునేందుకు ముఖం కడుక్కోవాలని, వేడి టీ తాగి కాసేపు విశ్రాంతి తీసుకున్నాకే ప్రయాణం కొనసాగించాలని సూచించారు. అసౌకర్యంగా ఉంటే వాహనాలను పక్కన నిలిపి నిద్రపోవాలని, ప్రాణాపాయ ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని అవగాహన కల్పించారు. ప్రతి టోల్ గేట్ వద్ద నిరంతరం ఈ పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## పేదరిక నిర్మూలనకు పీ4 వినూత్న మార్గం

అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : విజన్ యాక్షన్ యూనిట్స్ పీ4 తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. పేదరికాన్ని కేవలం సంక్షేమ పథకాల ద్వారా తగ్గించడం మాత్రమే కాకుండా, పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసి స్వయం సమృద్ధి సాధించే స్థాయికి తీసుకెళ్లాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 ఆలోచన అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు సమాజంలోని దాతలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల నిపుణులను భాగస్వాములను చేసి పేద కుటుంబాలకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార అవకాశాలు కల్పించడం ద్వారా వారిని పేదరికం నుంచి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే పీ4 ప్రధాన లక్ష్యం అని



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని వారి అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా శాశ్వతమైన మార్పు తీసుకురావచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒక ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు నిర్మించడం ఎంత ముఖ్యమో, అదే విధంగా అక్కడి పేద కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడం కూడా అంతే ముఖ్యమన్నారు. నాలుగు సంక్షేమ పథకాలు అందించడంతో ప్రభుత్వం బాధ్యత పూర్తయిందనే ఆలోచన కాకుండా, ఆ కుటుంబం తన కాళ్లపై తాను నిలబడేలా చేయడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. పీ4 కార్యక్రమాన్ని అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పేద కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలతో పాటు సామాజిక భాగస్వామ్యాన్ని అనుసంధానం చేస్తామని తెలిపారు. పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలనను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లడమే పీ4 లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మహత్తర ఆలోచనను అనంతపురం నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

## విద్యా వ్యవస్థను కాపాడండి..

### - జేఏసీ నేత అమర్ యాదవ్

అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు వారిష్టానుసారంగా వ్యవహరిస్తూ



విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో సతీష్ చౌదరి, విజయ్, యశ్వంత్ మురళి రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడుతూ.. కొంత మంది టీచర్లు విద్యార్థులు చదువు చెప్పబోక మరోపక్క టీచర్లు టీచర్లు విభేదించుకుంటూ ఒకరిపైన ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ చిల్లర రాజకీయాలు చేస్తున్న వారిపైన ఎందుకు జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కొంత మంది టీచర్లు అయితే విద్యార్థులను కులం పేరుతో, గర్ల్సను, మహిళా టీచర్లను, అక్కడే వంట పనిచేసే మహిళను లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. టీచర్లకు ఉన్న గౌరవాన్ని కొంతమంది వ్యక్తులు చీటీల పేర్లతో, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ పేర్లతో అనేక వ్యాపారాలు చేస్తూ వారికున్న గౌరవాన్ని కించపరుచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలా ఇక రకాలుగా పత్రికలలో, మీడియాలో వస్తున్న కథనాలపైన జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి ఉపాధ్యాయుల పైన కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రూరల్ మండలంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం ఆగస్టు 28 అనంత సూర్య : అనంతపురం రూరల్ మండలంలోని కాలనీలలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. అనంతపురం రూరల్ మండల పరిధిలో 80లక్షలతో నిర్మించిన ఆసుపత్రి భవనాలను ఆమె ప్రారంభించారు. కక్కలపల్లి కాలనీలో 38లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్) ను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాపంపేటలోని బసవతారక నగర్ లో 42లక్షల ప్రధానమంత్రి ఆయుస్మాన్ (అభిమ్) నిధులతో నిర్మించిన ఆసుపత్రికి కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు. రెండు కాలనీల్లోనూ ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం లభించింది. ఆస్పత్రుల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే సునీత అక్కడ బీపీ, షుగర్ వంటి పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల




సునీత మాట్లాడుతూ ప్రతి ప్రాంతంలో కూడా స్థానికంగానే ప్రజలకు వైద్య సహాయం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆసుపత్రులను ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో వీటి నిర్మాణాలు ఆగిపోయినప్పటికీ తాము వాటిని కొనసాగించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పూర్తి చేశామన్నారు. ఈ 2ఏళ్లలో ఈ 2పంచాయతీలలో 6కోట్ల నిధులతో అభివృద్ధి చేశామని వివరించారు. అనంతపురం రూరల్ మండలంలో ఈ 2ఏళ్ళల్లో సుమారుగా 100కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేసామని వివరించారు. 40కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద రూరల్ మండల పరిధిలోని ప్రతి కాలనీకి తాగునీరు అందించాలని పనులు చేపట్టారన్నారు. అయితే వీటికి బిల్లులు పెండింగ్లో ఉండటంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వాటిని విడుదల చేసేలా కృషి చేశామన్నారు. వచ్చే వేసవిలో గా ప్రతి ఇంటికి తాగునీరు అందించే విధంగా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. అధికారంలో ఉండగా ఏమీ చేయలేని కొంతమంది అసమర్థులు... ఇప్పుడు మాటలు చెబుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజల కోసం ఈ రెండేళ్లలో ఎంత చేసామన్నది ఒకసారి గుర్తించాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కటి పూర్తి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.


## రాయలసీమలో సాగు సంక్షోభం

అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : రాయలసీమలో సాగు సంక్షోభం నెలకొందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించకుండా చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులతో కలిసి శ్రీశైలం ప్రాజెక్ట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కరువు పరిస్థితులున్నాయని, మరీ ముఖ్యంగా రాయలసీమలో దుర్భిక్ష పరిస్థితి నెలకొందన్నారు. రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులు శ్రీశైలం మీదే ఆధారపడి ఉన్నాయని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనే విషయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. అనంతపురం జిల్లాలో 55 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 48 శాతం, వైఎస్ఆర్ కడప జిల్లాలో 31 శాతం, అన్నమయ్య జిల్లాలో 13 శాతం, చిత్తూరులో 23 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయని తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా 47 శాతం లోటు వర్షపాతం నెలకొందన్నారు. ఇక భూగర్భ జలాలు గత ఏడాదితో పోల్చితే అడుగంటిపోయాయని తెలిపారు. అనంతపురం జిల్లాలో 16 నుంచి 20 మీటర్లకు, శ్రీసత్యసాయి జిల్లాలో 20 మీటర్లకు, కడప జిల్లాలో 13 మీటర్లు, అన్నమయ్య జిల్లాలో 16 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయని తెలిపారు. తాగు, సాగునీటికే కాకుండా పశుగ్రాసం కొరత ప్రారంభమైందని, ఇప్పటికే రాయలసీమలో 75 శాతం పాల ఉత్పత్తి తగ్గిపోయిందని చెప్పారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందని మండిపడ్డారు. శ్రీశైలంలో పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 874.30 అడుగులు ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో శ్రైశైలం నుంచి తెలంగాణ ఎడాపెడా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీశైలానికి ఇన్‌ఫ్లో 13,171 క్యూసెక్కులు ఉంటే విద్యుత్ ఉత్పత్తికి తెలంగాణకు ఔట్‌ఫ్లో 26,114 క్యూసెక్కులుగా వెళ్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు వారాల్లోనే శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు పడిపోతుందన్నారు. ఇదే విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి చెబితే ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేశారన్నారు. శ్రీశైలంలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేసిన నీళ్లు నాగార్జున సాగర్‌కే వస్తున్నాయి.. కృష్ణా డెల్టాకు ఇస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. తాము నాగార్జున సాగర్‌కు, కృష్ణా డెల్టాకు వ్యతిరేకం కాదని, అదే సమయంలో రాయలసీమకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీళ్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికే 30 టీఎంసీలను పట్టిసీమ నుంచి అందించారని తెలిపారు. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం నీళ్లు తరలించుకుంటూ పోతే 10 రోజుల్లో నీటి మట్టం 854 అడుగులకు చేరుకుంటుందని చెప్పారు. అదే పరిస్థితి వస్తే పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు ఇచ్చే అవకాశం ఉండదని తెలియజేశారు. 834 అడుగులకు పైన ఉంటేనే అనంతపురం జిల్లాకు హంద్రీనీవా నుంచి నీళ్లు కూడా వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 874 అడుగులే ఉన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలన్నారు. అదేవిధంగా తుంగభద్ర డ్యాం పరిధిలోని హెచఎలఎంసీ, నార్త్, సౌత్ కెనాల్, జీబీసీ పరిధిలో ఆరుతడి పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన శిష్యుడు రేవంత్‌రెడ్డి కోసం రాయలసీమ ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టుపెడుతున్నారని, అందులో భాగంగానే శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీళ్లు వదులుతున్నారని విమర్శించారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం పంటల బీమాకు సంబంధించి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహనరాహిత్యానికి నిదర్శనమని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఉచిత పంటల బీమాను అందుబాటులోకి తెస్తే కూటమి అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని నిలిపివేశారని అన్నారు. పంటల బీమా కింద 2019--2024 మధ్య వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 54.55 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.7,802 కోట్ల మేర పరిహారాన్ని అందజేసి ఆదుకున్నామని గుర్తు చేశారు. పంట నష్టపరిహారంగా ఐదేళ్లలో రూ.3,261 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు భరోసా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయని, సాగుకు సన్నద్ధమై పంటలు వేయలేని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

## ఎంపీకి రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళలు



అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన సీఎం వీసీ కార్యక్రమానికి హాజరైన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఓం శాంతి ట్రస్ట్ బ్రహ్మకుమారీలు, మహిళలు, దివ్యాంగులు ఆత్మీయంగా కలిశారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు ఎంపీకి రాఖీలు కట్టి, మిఠాయి తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతను మరింత బలపరిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగకు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు, అన్నదమ్ములకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.




**అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య :**

రూ.25 వేలు.. రూ.25 వేలు.. రూ.25 వేలు... అందులో నాకింత, మీకు కొంత. కాదు కూడదంటే అంతా నాకే. నా స్వచ్ఛంద సంస్థలతోనే కార్యక్రమాలు చేపట్టి మొత్తం తీసేసుకుంటా అన్నట్టుగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడట పదేళ్లుగా పాతుకపోయి **'భరత్ అనే నేను'** అంటూ.. అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన ఆ వివరాలను ఒక్కసారి పరిశీలిస్తే.. అనంతపురం జిల్లాలోని నెహ్రూ యువ కేంద్రంలో ఒక్కో ఎన్జీవో చేపట్టే కార్యక్రమాలకు దాదాపు రూ.25 వేల వరకు చెల్లించే వెసులుబాటు ఉంది. ఆ నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలవుతున్నవే. అయితే ఎన్జీవో సంస్థలు చేపట్టే ఆ కార్యక్రమాలకు ఇవ్వాల్సిన మొత్తాల కంటే, అసలును మెక్కేసి కొసరును మాత్రమే ఇస్తూ.. నిధుల తిర'కాసు' పనులకు పాల్పడు తున్నారని తెలుస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అనంతపురం జిల్లాలోని నెహ్రూ యువ కేంద్రం అనంతపురం వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. కేంద్రంలో ఒకే వ్యక్తి పెత్తనం, వన్ మెన్ షో నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### పదేళ్లుగా పాతుకుపోయి...

సుమారు పదేళ్లుగా ఒకే వ్యక్తి జిల్లా యువ కేంద్ర వ్యవహారాల్లో కీలకంగా ఉన్నారని, రూ.లక్షల నిధుల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు యువజన సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఎన్జీవో సంస్థల ఎంపిక మొదలు, నిధుల మంజూరు వరకు అంతా ఒకేచోట నుండి కాదు.. కాదు.. ఒకే వ్యక్తి డైరెక్షన్లో నడుస్తోందనే చర్చ జరుగుతోంది.

### నాన్ లోకల్ అయినా అనంతలో చక్రం...

స్థానికేతరుడైనప్పటికీ అనంతపురంలోనే తిష్టవేసి, అధికారులతో సన్నిహిత సంబంధాలు నెరుపుతూ యువ కేంద్రమంతటా చక్రం తిప్పడంలో సిద్ధహస్తునిగా ఆ వ్యక్తి పేరు నానుతోంది.

### నిజమైన సేవకులకు మొండిచెయ్యి:

నిజంగా సేవా కార్యక్రమాలు చేసే స్వచ్ఛంద సంస్థలకు, యూత్ క్లబ్‌లకు అవకాశాలు ఇవ్వకుండా, తమకు అనుకూలమైన వారికే కార్యక్రమాలు, నిధులు కట్టబెడు తున్నారనే విమర్శ ఉంది. సేవకు దూరంగా ఉంటూ.. అవార్డులు, రివార్డులకు మాత్రం ముందు వరుసలో ఉంటారని పలువురు చెబుతున్నారు. ఉదాహరణకు ఇటీవల మెగాస్టార్ పుట్టినరోజు వేడుకల్లో కూడా ఖర్చు ఒకరు పెట్టుకుంటే.. పబ్లిసిటీ మాత్రం ఇతనే చేసుకున్నాడన్న ఆరోపణ ఉంది.

### కోట్లకు పడగలు?

ఇతనికి సంబంధించిన ఎన్జీవోలు అనగా.. ప్రగతి పథకం, యూత్ అసోసియేషన్, ఆర్ట్ ఆఫ్ గివింగ్ ఫౌండేషన్‌లకే పెద్దపీట వేసుకుంటూ, ఇచ్చేది అతనే.. తీసుకునేది అతనే.. అన్నట్లుగా నెహ్రూ యువ కేంద్రంలో కొందరు పెద్దల ఆశీస్సులతో అప్పనంగా వస్తున్న సొమ్ముతో రూ.లక్షల్లో ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే కాకుండా ధనార్జన లక్ష్యంగా కేంద్రంలోని పలువురు రాజకీయ నేతలను, ఎంపీలను పదే పదే కలుస్తూ వ్యక్తి ప్రయోజనం కోసం నిధులు రాబట్టుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ఇతనికి జిల్లా ఇన్చార్జి అధికారి సహాయ సహకారాలు ఆశీస్సులు ఒక అనంతపురంతో పాటు కర్నూల్లో కూడా ఉన్నాయని, ప్రస్తుతం ఇక్కడ ఇన్చార్జ్ అధికారి శ్రీనివాసులు కర్నూల్లో కూడా అధికారి కావడం ఇతనికి అతనికి ఉన్న పాత పరిచయాల నేపథ్యంలోనే గతంలో ఇక్కడ అకౌంటెంట్‌గా పని చేసిన వ్యక్తి.. నేడు రెండు జిల్లాలకు అధికారిగా ఉండటం విశేషం.

అయితే ఇక్కడ వాస్తవానికి అధికారి శ్రీనివాస్ పేరు కన్నా.. భరత్ పేరే పదే పదే అన్నిచోట్ల వినిపిస్తూ ఉండడంతో నెహ్రు యువ కేంద్రంలో వినిపిస్తున్న అవినీతి అక్రమ ఆరోపణలకు మరింత ఆజ్యం పోసేలా కనబడుతుంది. ఏది ఏమైనా ఇక్కడి తంతుపై రాష్ట్ర అధికారులతో పాటు కేంద్రాధికారులు కూడా లోతైన విచారణ జరిపితే అసలు బాగోతాలు బయటపడతాయని స్థానికంగా ఉన్న పలువురు యువత డిమాండ్ చేస్తోంది. దీనిపై జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి వివరణ తీసుకునే ప్రయత్నం చేయగా.. స్పందన లభించలేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, గత పదేళ్ల లెక్కలు, విడుదలైన నిధులు, ఖర్చుపెట్టిన దాఖలాలు, అత్యధికంగా కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల పేర్లు, నిధుల వినియోగంపై విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు.

- పదేళ్లుగా పాతుకుపోయి రూ. లక్షల్లో నిధుల తిర'కాసులు' ?
- ఎన్జీవో సంస్థల నిర్వహణ మొదలు యువ కేంద్రమంతటా.. నాన్ లోకల్ అనంతలో 'చక్రం'
- సేవా కార్యక్రమాల నిర్వహణలో నిజమైన ఎన్జీవోలకు మొండి చేయి
- నిజ సేవకు దూరం.. అవార్డులు, రివార్డులకు ముందు వరుసలో !
- శ్రీనివాసుని ఆశీస్సులు అప్పనపు సొమ్ముతో రూ.కోట్లకు పడగలు ?
- ఇదీ 'మాయా కేంద్రం'లోని మాయగాళ్ల బాగోతాలు ( కథనం-2 )

# యువజన విభాగం బలోపేతం చేద్దాం

**ప్రభుత్వ వైఫల్యాలను కలిసికట్టుగా ఎండగడదాం**
**వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర**



**అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధంగా యువజన విభాగంను అందరూ కలిసికట్టుగా బలోపేతం చేద్దామని యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని 1వ డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ వద్ద 1, 2 సచివాలయాల పరిధిలోని యువజన విభాగం కమిటీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ, యువజన విభాగం బలోపేతం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇచ్చిన హామీల అమలులో విఫలం చెందిందని సాకే చంద్ర అన్నారు. ప్రధానంగా యువతకు చంద్రబాబు మోసం చేశారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకత్వ లక్షణాలు బలపడతాయని, ప్రజల తరఫున కలిసికట్టుగా ప్రశ్నిద్దామని అన్నారు. త్వరలోనే ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ హనుమంతు, మాజీ కార్పొరేటర్ లాలూ, వైసీపీ నేతలు, యువజన విభాగం నాయకులు వెంకట్రాముడు, రఫి, అంజి, కాలేషా, ఫకృద్దీన్, దాదు, మైను, వీర, అఫ్రీది, చిట్టి, గణేష్, మారుతి, ప్రశాంత్‌రెడ్డి, ఆకాష్, వడ్డే వెంకటేష్, సుబహాన్, ప్రేమ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నూతన వస్త్రాలు అందచేత




పెనుకొండ, ఆగస్టు 28:( నమస్తే అమరావతి) : దివంగతరామా నాయక్ కు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి ఆయన తనయుడు సాయి కళ్యాణ్, రాష్ట్ర ఉప్పర సగర కమిటీ చైర్మన్ రంగేపల్లి వెంకటరాముడు, మండల తోగ ట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సీసీ హరి పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామా నాయక్ కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన ఉచిత కంటి చికిత్స శిబిరంలో సుమారుగా 750 మంది పాల్గొన్నట్లు తెలిపారు. అందులో 175 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక కాగా 120 మందికి ఆపరేషన్లు దిగ్విజయంగా పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 70 మందికి చెన్నైలో త్వరలోనే ఆపరేషన్లు పూర్తి చేయునట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీబీకే పార్థసారథి మాట్లాడుతూ స్వర్గీయ రామా నాయక్ 12వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు బాపూజీ నాయక్ ప్రసాద్ నాయక్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజల నుండి స్పందన రావడం, కంటి చూపు లేనివారు ఆపరేషన్ ద్వారా కంటిచూపు పొందడం శుభ పరిణామన్నారు. తండ్రి అడుగుజాడల్లో కుమారులు నడుస్తూ సమాజ సేవలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు. భవిష్యత్తులో తన పరిధిలో ఏ విధమైన సాయం కావాల్సిన అందజేయడానికి తాను కూడా సిద్ధంగా ఉన్నట్లు బి కే ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రముఖులకు రమానాయకు కుటుంబ సభ్యులు ఆత్మీయంగా సన్మానం చేశారు. సన్మానం అందుకున్న వారిలో గ్రంధాలయ చైర్మన్ వడ్డే వెంకట్, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసిహరి, సాయిబాబా ఆలయ ట్రస్టు చైర్మన్ రెడ్డి, పలువురు ప్రముఖులు ఉన్నారు.

# పరిటాల వారి ఇంట రక్షాబంధన్ సందడి

- తన సోదరులకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థకు రాఖీ కట్టిన సోదరి స్నేహలత
- తన జీవితంలో సోదరుల సహకారాన్ని మరువలేనన్న సునీత



అనంతపురం, ఆగస్టు 28 అనంత సూర్య : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంట.. రక్షా బంధన్ సందడి కనిపించింది. అనంతపురంలోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి రాఖీ పౌర్ణమి ఘనంగా జరుపుకున్నారు. తన సోదరులు ధర్మవరపు బాలాజీ, మురళీతో పాటు ఇతర సోదరులకు ఎమ్మెల్యే సునీత రాఖీలు కట్టారు. మిఠాయిలు తినిపించి తన ప్రేమను చాటుకున్నారు. సోదరులు ఎమ్మెల్యే సునీత పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే కార్యాలయ సిబ్బంది, నియోజకవర్గ ముఖ్య నాయకులు, అధికారులు, గన్ మెన్లకు రాఖీ కట్టారు. బ్రహ్మకుమారీలు పరిటాల సునీత నివాసంలో అందరికీ రాఖీలు కట్టారు. మిఠాయిలు పంచి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ కు వారి సోదరి పరిటాల స్నేహలత రాఖీ కట్టారు. పరిటాల శ్రీరామ్ కుమారుడు జూనియర్ పరిటాల రవీంద్రకు తన సోదరి అమైరా రవీంద్ర రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక ఎమ్మెల్యేగా, గతంలో మంత్రిగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే వెనుక ఎంతో మంది అన్నదమ్ముల సహకారం ఉందన్నారు. నాకోసం పనిచేస్తున్న వారిని, నా వెంట నడుస్తున్న వారిని ఎప్పటికీ మరువలేనని అన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం మాస్ అవేర్‌నెస్ ర్యాలీ




అనంతపురం క్రైం ప్రతినిధి, ఆగస్టు 28 అనంత సూర్య : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆత్మకూరు పోలీస్ జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం మాస్ అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జిల్లా ఈగల్ సెల్ సబ్-ఇన్‌స్పెక్టర్ హనుమంతు, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ రావు, పోలీస్ సిబ్బంది, 5 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సందేశం అందించారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. డ్రగ్స్ వద్దు – ఆరోగ్యకరమైన భవిష్యత్తు ముద్దు" అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పలువురు పాల్గొన్నారు.

## త్వరలోనే రాష్ట్రంలో 3 లక్షల పింఛన్లు

# మంజూరు చేస్తాం



- ఎమ్మెల్యే దగ్గుపాటి
- పార్టీలకు అతీతంగా అర్హులకు మాత్రమే పింఛన్లు ఉంటాయన్న ఎమ్మెల్యే
- అర్బన్ టిడిపి కార్యాలయంలో 56వ ప్రజా దర్బార్ కార్యక్రమం
- వంకర టింకర రోడ్లు తప్ప వైసీపీ చేసింది ఏంటి..?
- త్వరలోనే 176 కోట్లతో పనులు ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి




**అనంతపురం, ఆగస్టు28 అనంతసూర్య :**

రాష్ట్రంలో త్వరలోనే 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరవుతాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన 56వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకి తమ సమస్యలను చెప్పుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరిస్తూ ఓపిగ్గా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1230 అర్జీలు వచ్చాయని, అందులో 28 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రెవెన్యూతో పాటు వివిధ రకాల కారణాలతో అవి పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జిల్లా కలెక్టరేట్ లో తప్ప ఎక్కడా ప్రజల సమస్యలు చెప్పుకునేందుకు ఒక వేదిక లేదని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏ రోజు ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ రెండేళ్లలోనే 56సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎక్కువగా ప్రజల నుంచి పింఛన్లు కావాలని విజ్ఞప్తి వస్తోందని.. త్వరలోనే మూడు లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. గత ప్రభుత్వంలోలా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తామన్నారు. మరోవైపు రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో సర్వనాశనం చేసి పది లక్షల కోట్ల అప్పులు పెట్టి పోయారన్నారు. అమరావతిని పక్కనపెట్టి తుగ్లక్ తరహాలో పాలన సాగించారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత.. అమరావతితో పాటు పోలవరం ప్రాజెక్టును కూడా మళ్లీ పట్టాలెక్కించారన్నారు. 2029కి అమరావతిని పూర్తి చేసి దేశంలోనే ఒక నెంబర్ వన్ సిటీగా నిలుపుతారన్నారు. గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. జగన్మోహన్ రెడ్డిని చూసి ఉన్న పరిశ్రమలు కూడా వెళ్లిపోయారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ప్రపంచం మొత్తం గూగుల్ వైపు చూస్తే గూగుల్ విశాఖ వైపు చూసి లక్షన్నర కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టిందన్నారు. రాయలసీమలో కూడా పారిశ్రామికాభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. అనంతపురం జిల్లాలో కూడా లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇటు హంద్రీనీవా గతంలో 1800 క్యూసెక్కులు మాత్రమే ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో 3500 కోట్లు ఖర్చుపెట్టి ఇప్పుడు 4000 క్యూసెక్కుల వరకు నీరు తీసుకునేలా చేశారన్నారు. సూపర్ ఎల్. నినో ఉన్నప్పటికీ కూడా ఇటు తుంగభద్ర అటు శ్రీశైలం నుంచి 26 టీఎంసీలను తీసుకొస్తున్నారని... తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1296 కోట్లతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఇందులో రూ.250 కోట్లు కేవలం రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులకు ఖర్చులు చేశామన్నారు. వైసీపీ హయాంలో వంకర, టింకర రోడ్లు తప్ప చేసింది ఏంటని ఆయన నిలదీశారు. మరో నెల రెండు నెలల్లో 176 కోట్లతో నగరంలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, కార్పొరేషన్ డైరెక్టర్లు కడియాల కొండన్న, బెస్త పవన్ కుమార్ పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405